
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024



శివుని దర్శించుకున్న దిల్ రాజు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్‌రాజు గురువారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేయగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. స్థానిక టిడిపి బాలాజీ, భరద్, దుర్గాప్రసాద్ శివయ్య తీర్థప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.

వద్దన్నా ముందుకే..

- రద్దీ ప్రదేశాల్లో....
- మద్యం, టపాకాయల దుకాణాలు
- నిబంధనలకు పాతర



తమ ఏర్పాట్లలో ఉన్న మద్యం దుకాణదారులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో పలు శాఖల అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. తీవ్ర ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటున్నాయి. ప్రజలు వద్దంటున్నా.. నిబంధనలు వ్యతిరేకిస్తున్నా 'తాము పట్టిన కుందేలుకు మూడే కాళ్లు' అన్న చందంగా ఆ శాఖల అధికారులు వ్యవహరిస్తున్న పరిస్థితి. మొన్నటికిమొన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్లను స్థానిక భక్తులు దర్శించుకోవాలంటే ఆధార్ కార్డ్, స్లిప్పులను తప్పనిసరి చేస్తూ ఈవో తీసుకున్న నిర్ణయం పట్టణవాసుల్లో తీవ్ర దుమారాన్ని లేపింది. 'మా దేవున్ని మేం దర్శించుకోవాలంటే' ఆధార్ కార్డులు అడగడమేంటని స్థానిక భక్తులు పెదవి విరిచారు. ఇది ముమ్మాటికీ స్థానిక భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనంటూ సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. దీంతో నాలుక కరుచుకున్న ఆలయ అధికారులు స్థానిక భక్తులకు 'వీఐపీ' తరహా దర్శనం కల్పించేందుకే ఆధార్ కార్డులంటూ కవరింగ్ ఇచ్చారు. తాజాగా పాత బస్టాండ్ ప్రాంతంలో మద్యం షాపు నిర్వాహణకు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో ఉన్న జూనియర్ బాలుర కళాశాల ఆవరణలో టపాకాయల విక్రయ దుకాణాల ఏర్పాటుకు అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వద్దు వద్దు అంటున్నా.. అధికారులు ఎందుకు మొండిగా ముందుకే వెళ్తున్నారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మామూళ్లకు ఆశపడి నిబంధనలకు పాతరేస్తూ ప్రజల జీవితాలను ఫణంగా పెడుతున్నారని దుమ్మెత్తి పోస్తున్న పరిస్థితి.

ఆసుపత్రి పక్కనే మద్యం దుకాణం

పట్టణంలోని పాత బస్టాండ్ వీధిలో ఓ ప్రైవేట్ మద్యం దుకాణం ఏర్పాటుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఎప్పుడు అత్యంత రద్దీగా ఉండే ఈ వీధిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు పెదవి విరిస్తున్నారు. ఈ దుకాణం చుట్టుపక్కల రెండు ప్రైవేటు ఆసుపత్రులు, రెండు మెడికల్ షాపులు, పై భాగంలో విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి, రాయలసీమ జూనియర్ కాలేజీ, బాబు అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల, నారద పుష్కరిణి, కుమార స్వామి ముఖ మండపం ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ నిబంధన-2012 ప్రకారం గుడికి, బడికి, ఆస్పత్రులకు 100 మీటర్ల అవతల మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం దుకాణం నిర్వహణకు అనుమతులు ఎలా ఇస్తారంటూ అక్కడి మహిళలు, స్థానిక భక్తులు జిల్లా కలెక్టర్‌కు, ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందజేశారు. గతంలో పాత బస్టాండ్ ప్రాంతంలో మద్యం దుకాణాన్ని నిర్వహించడం వల్ల ఓ వ్యక్తి తప్ప తాగి బస్సు కింద పడి ప్రాణాలు విడిచిన సంఘటన కూడా చోటుచేసుకుంది.

లేదంటూనే అనుమతి..

పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రతిఏటా టపాకాయల దుకాణాల ఏర్పాటుకు అనుమతులిస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో రెండు విద్యాసంస్థలు, ఒక ప్రభుత్వ ఆసుపత్రి, సమీకృత హాస్టల్, ఓ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో ప్రమాదం పొంచి ఉందంటూ ప్రజలు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా టపాకాయల కేంద్రం నిర్వహణ వల్ల ఏరియా ఆసుపత్రికి వెళ్లే రోడ్డుపై పెద్దఎత్తున ట్రాఫిక్ ఏర్పడుతోంది. అలాంటి సమయంలో అత్యవసర కేసులను తీసుకెళ్లే అంబులెన్సులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేయరాదంటూ పెద్ద ఎత్తున అభ్యంతరాలు రావడంతో బుధవారం ఆర్డీవో, డీఎస్పీ, అగ్నిమాపకశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్ జూనియర్ కళాశాల వద్దకు వెళ్లి స్థలపరిశీలన చేశారు. ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటామనీ, ప్రత్యామ్నయం ఆలోచిస్తామని చెప్పి గుట్టు చప్పుడు కాకుండా అనుమతులు ఇచ్చేసిన పరిస్థితి. ఇకనైనా సంబంధిత అధికారులు మేల్కొని ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

రుయాలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు చర్యలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు



రుయా ఆసుపత్రి వైద్య అధికారులతో మాట్లాడుతున్న కృష్ణబాబు

ప్రజాశక్తి- తిరుపతి సిటి : రుయా ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని, వైద్యులు ఆస్పత్రికి వచ్చే పేదరోగులకు మెరుగైన వైద్యసేవలు బాధ్యతగా అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ బాబు తెలిపారు. స్థానిక రుయా ఆస్పత్రిలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా స్పెషల్ సిఎస్‌ని పలువురు పారిశుద్ధ్య కార్మికులను విచారించగా వారు తమకు సక్రమంగా ఏజెన్సీ నుండి వేతనాల రావడం లేదని తెలపడంతో సత్వర చర్యలకు ఆదేశించారు. ముందుగా అత్యవసర కేసుల రిజిస్ట్రేషన్ విభాగాన్ని, ఎక్స్ రే యూనిట్‌ను పరిశీలించి రోజువారీగా ఎంతమంది చికిత్సకు వస్తున్నారని ఆరా తీశారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డును తనిఖీ చేసి అందుతున్న సేవలను చికిత్స పొందుతున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వైద్య అధికారులు వివరిస్తూ క్యాజువాలిటీ వార్డు భవనం సరిపోవడం లేదని తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌లో జరుగుతున్న సర్జరీల వివరాలను, ఆస్పత్రి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్జికల్ ఇంప్లాంట్స్, అత్యవసర మందులు ఉన్నాయా లేదా అని సర్జికల్ మెటీరియల్ తగినంత ఉందా అని ఆరా తీసి అవసరం మేరకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. అనంతరం ఓపి విభాగాన్ని ఈ - ఔషధి తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఏ రోజుకు ఆ రోజే ల్యాబ్ రిపోర్టులను అందించేలా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రుయా ఆస్పత్రి జిల్లాలోని పలు ప్రజలకు ఎంతో ముఖ్యమైనటువంటి ఆస్పత్రిఅని, ఈ ఆస్పత్రిలో సదుపాయాలను ఏ విధంగా మెరుగుపరచాలనే అంశంపై సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ తదితరులతో గత రెండు మూడు నెలలుగా దీనిపై దృష్టి సారించి, మెరుగైన సేవలు అందించడానికి రూపకల్పన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం ఏవిధంగా రుయా ఆస్పత్రిలో వైద్యసేవలు అందుతున్నాయని విషయంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులతో కలిసి సెక్యూరిటీ అంశం, మందుల స్టాక్, సీసీ కెమెరాల ఏర్పాటు, సర్జికల్ పరికరాలు, సిబ్బంది ఏర్పాటు తదితరాల పరిశీలన చేస్తున్నామని, ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకునేలా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. 90 కోట్ల రూపాయల వరకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, పీజీ సీట్లు పెంచుతున్న నేపథ్యంలో సదుపాయాల కల్పన ఏర్పాటు కొరకు సివిల్ కన్స్ట్రక్షన్ కొరకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పూర్తి అయిన వెంటనే మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఉదయం ఓపి, మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ఓపి లక్ష్యంతో సాయంత్రం కూడా ఒపి ప్రారంభించడం జరిగిందని, రోగులు మళ్ళీ రెండో రోజు రాకుండా అదే రోజు చికిత్స తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంబంధిత ఫ్యాకల్టీ, సర్జికల్ సిబ్బంది తప్పకుండా ఆ సమయాల్లో అందుబాటులో ఉండే విధంగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి తనిఖీలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, వైద్య అధికారులు పాల్గొన్నారు.



సోలార్ ప్లాంట్ పనులు పురోగతిపై మాట్లాడుతున్న కమిషనర్ ఎన్ మౌర్య

సోలార్ ప్లాంట్ పనుల పురోగతి పై సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్మార్ట్ సిటీ నిధులతో తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన ఆరు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ పనుల పురోగతిపై స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో సమీక్షించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో పనుల పురోగతిపై స్మార్ట్ సిటీ అధికారులు, ఏఈకాం, నోవాటేల్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇచ్చిన గడువు కంటే ఎక్కువ సమయం అవుతున్నా ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి సోలార్ ప్లాంట్ శుభ్రం చేసి పనులు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ అధికారులు, ఏఈకాం ప్రతినిధులు సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పెండింగ్ పనులు పూర్తిచేసి వినియోగంలోనికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డీఈ లలిత, ఏఈకాం ప్రతినిధులు బాలాజీ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

బండ్ల లక్ష్మీపతి పై చర్యలు తీసుకోవాలి: సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రుయా ఆసుపత్రి ఛైర్మన్ అంటూ ఆటో డ్రైవర్‌పై, వైద్యులపై దౌర్జన్యానికి పాల్పడిన బండ్ల లక్ష్మీపతిపై చర్యలు తీసుకోవాలని, తక్షణం రుయా ఆసుపత్రి వర్కింగ్ కమిటీ సభ్యుడి హోదాను తొలగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆసుపత్రి వర్కింగ్ కమిటీ సభ్యుడు హోదాలో ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పడాలి కానీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని పనులకు ఆటంకం కల్పిస్తూ, ఆఖరుకు ఆక్సిజన్ మాస్క్‌తో ఉన్న రోగిని హాస్పిటల్‌లోకి పోనివ్వకుండా అడ్డుకున్న బండ్ల లక్ష్మీపతి వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించారు. మానవత్వం మరచిపోయి వ్యవహరించిన తీరును ఆయన తప్పుపట్టారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ వ్యవహారంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ఇదేనా జన సైనికులు ప్రజలకు ఇచ్చే మర్యాద అని ప్రశ్నించారు. పట్టించుకుని పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే కనీసం అటువైపు తలెత్తి చూడటం లేదని, నిధుల లేమితో నీరసించిన రుయా ఆసుపత్రిలో పూర్వ విద్యార్థులు కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే, అడ్డుకోవడం ఏ రకంగా సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టను ఆర్జించిన రుయా ఆసుపత్రి ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభంలో కొట్టు మిట్టాడు తోందని కాంట్రాక్ట్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందించడం లేదని ఆరోపించారు. 1268 పడకల రుయా ఆసుపత్రిలో కేవలం 85 మంది సిబ్బందితో నడపటం సాధ్యమయ్యే పనేనా.. ఇలాంటి వాటిపై కేంద్రీకరించాల్సిన అధికార పార్టీ నాయకులు రుయా ఆసుపత్రి గౌరవాన్ని అప్రతిష్ట పాల్జేస్తున్నారని, వైద్యుల పనికి ఆటంకంగా తయారవుతున్నారని దీనిని ప్రజలు క్షమించరని అన్నారు. ఈ వైఖరిని మానుకోవాలని హితవు పలికారు.

26న ఇండియన్ ఐడెల్ కార్తీక్ లైవ్ షో



మాట్లాడుతున్న డాక్టర్ సజిత్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలో మొట్టమొదటిసారి ఇండియన్ ఐడెల్ టైటిల్ విజేత, ప్రముఖ సినీగాయకుడు కార్తీక్ 26 తేదీన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ స్టేడియంలో లైవ్‌షోను నిర్వహిస్తున్నామని ఆదరించాలని నిర్వాణ ఎంటర్టైన్మెంట్స్ నిర్వాహకులు డాక్టర్ సజిత్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ కోరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లైవ్ షో వివరాలను వివరించారు. కార్తీక్ ఇప్పటి వరకు 10 భాషలలో 8 వేల పాటలను పాడినట్లు తెలిపారు. ముఖ్యంగా తిరుపతిలో ఇటువంటి లైవ్ ఈవెంట్స్ నిర్వహించడం వలన వందల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ ఇవెంట్ నిర్వహణ కోసం సంబంధిత అధికారుల వద్దకు వెళ్ళి అన్ని అనుమతులు తీసుకున్నామని, ఈ లైవ్ ఈవెంట్లో అందరికి వినోదాన్ని పంచాలనే ఉద్దేశ్యంతో ప్రవేశ టికెట్లును అందుబాటులో ఉండే ధరలకే విక్రయించాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరు వేల మంది హాజరైతున్నారని, దీనికి తగ్గ భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చాణిక్య, జయప్రకాష్ పాల్గొన్నారు.

రాబోయే కాలం డిజిటల్ టెక్నాలజీ దే : కలెక్టర్



అంతర్జాతీయ సదస్సులో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఇతర దేశాల ప్రతినిధులు

ప్రజాశక్తి - క్యాంపస్: రాబోయే కాలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరింతగా అభివృద్ధి చెంది టెక్నాలజీదే ప్రముఖపాత్ర వహిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు, ఎన్జీవోలకు ఆధునిక సాంకేతిక డిజిటల్ టెక్నాలజీ పై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వర్సిటీ విసి ఆచార్య ఉమ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనీ, ప్రభుత్వం స్టార్ట్ అప్ పరిశ్రమలకు అన్ని విధాలుగా చేయూతనిస్తోందనీ, రానున్న కాలమంతా డిజిటల్ టెక్నాలజీ దే అన్నారు. డిజిటల్ ప్లాట్ ఫామ్ వినియోగించుకుని మార్కెటింగ్, పేమెంట్ తదితరాలు సులువుగా చేసుకోవచ్చునీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉమెన్ ఐసిటి ఫ్రంటైర్ ఇనిషియేటివ్ అనేది వైఫై డిఎక్స్‌గా నూతనంగా రూపు తీసుకుని మహిళా వ్యాపారవేత్తలుగా డిజిటల్ ప్రపంచంలోకి ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన శిక్షణ సామర్థ్యాలను అందించేందుకు రూపొందించబడిందని అన్నారు. దేశంలో ఏకైక ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సెంటర్‌గా 2018 నుంచి సుమారు 3000 మందికిపైగా మహిళలకు ఆత్మనిర్భర్ భారత్ అభివృద్ధి చేయడంలో మహిళ యూనివర్సిటీ ప్రముఖపాత్ర పోషిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఈ డిజిటల్ ప్రపంచాన్ని ఎదుర్కొని తాము నిర్వహిస్తున్న వ్యాపారాలను లాభసాటిగా మలుచుకునేందుకు అవసరమైన మెలకువలు వ్యాపారరంగంలో డిజిటల్ వ్యవస్థ వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాను పాలుపంచుకోవడం ఎంతో ఒగర్వంగా భావిస్తున్నానని డాక్టర్ కియోంగ్ కో తెలిపారు. ఏపీ ఎస్సిహెచ్ఈ వైస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి దేవి, మహిళా వర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి.విజయలక్ష్మి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని, మాజీ విసి ఆచార్య వి.దుర్గాభవాని, పారిశ్రామిక వేత్తలు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేస్తాం..

ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌గా మల్లికార్జున్ రెడ్డి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులతో పాటు తిరుపతికి తాగునీరు అందించేందుకు బాలాజీ రిజర్వాయర్ పనులు, మల్లెమడుగు రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేస్తామని ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎం.మల్లికార్జున రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తిరుపతిలో తన ఛాంబర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కడప నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అనంతరం మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పెండింగ్లో ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులతో పాటు హంద్రీ-నీవా పనులు పూర్తి చేసి ప్రజలకు నీటిని అందించనున్నట్లు వెల్లడించారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడ తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు బాలాజీ రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. అలాగే మల్లెమడుగు ప్రాజెక్ట్ పూర్తిచేసి రైతులకు నీరు అందించేలా చూస్తామని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ప్రజలకు తాగు, సాగునీరు అందించే ప్రాజెక్టులను సకలంలో పూర్తి చేయడమే తమ కర్తవ్యమని చెప్పారు. అంతకు ముందు పలువురు ఇంజనీరింగ్ విభాగ ఉన్నత అధికారులు మల్లికార్జున్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధి పనులకు పాధాన్యత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిచ్చి త్వరగా పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో గురువారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజాఉపయోగకరమైన పనులు చేయాలన్నారు. ముందస్తుగా నగరంలో డ్రైన్‌లలో చెత్త, మురుగు తొలగించడం వలన ఎక్కడా నీరు నిలవకుండా వెళ్ళాయని అన్నారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మురుగుకాలువల మరమ్మతులు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్యం కూడా మీరు చొరవ చూపి ఆరోగ్యశాఖ అధికారులతో కలసి పని చేయాలన్నారు. నగరంలో అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఈలు రాజు, మహేష్, మధుబాబు, లలిత, రమణ పాల్గొన్నారు.

రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: దొమ్మరపాలెం ఇసుక ట్రాక్టర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కంచి రాజేంద్ర కుటుంబానికి రూ.50లక్షలు పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం దొమ్మరపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొని చియ్యవరం గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు రాజేంద్ర, చైతన్య ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ మేరకు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద మృతుల బంధువులతో కలిసి సిపిఎం, సిపిఐ, వైసీపీ నేతలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వపాలనలో ఉచిత ఇసుక మాఫియా చేతుల్లోకి వెళ్ళిందని ఆరోపించారు. స్థానికులకు ఇసుక దొరకాలంటే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరతతో పనిలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో రెండు నిండు ప్రాణాలు గాల్లో కలిసి పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే, ఆర్డీవో, ఎస్పీ స్పందించి ఇసుక మాఫియాపై చర్యలు తీసుకుని రాజేంద్ర కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు గంధం మణి, పెనగడం గురవయ్య, సిపిఐ నేతలు జనమాల గురవయ్య, వైసీపీ నేతలు అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆసుప్రతి వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు

తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి డీఈవోగా..

కెవిఎన్. కుమార్ నియామకం



ప్రజాశక్తి - తిరుపతి: తిరుపతి జిల్లా ఇంచార్జ్ డీఈవోగా కెవిఎన్.కుమార్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గురువారం చేపట్టిన విద్యాశాఖ అధికారుల బదిలీల భాగంగా ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న కుమార్ ను తిరుపతి జిల్లాకు బదిలీ చేసింది. పుత్తూరు డిప్యూటీ విద్యాశాఖ అధికారిగా నియమించినప్పటికీ తిరుపతి డిఈఓ గానూ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు వెలువరించింది. నూతనంగా ఏర్పాటైన తిరుపతి జిల్లాకు రెగ్యులర్ డిఈఓ పోస్టు లేకపోవడంతో ఆస్థానంలో పుత్తూరు డివైఈవోకు అదనపు పూర్తి బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం తిరుపతి ఇన్ఛార్జి డీఈఓగా ఉన్న శేఖర్‌ను తన మాతృ స్థానమైన కార్వేటినగరం డైట్ ప్రిన్సిపల్‌గా కొనసాగేలా ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.

తిరుపతి ఆర్‌డిఓగా బి.రామ్మోహన్

డిఆర్‌ఓ పెంచల కిషోర్ బదిలీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి ఆర్‌డిఓగా బి.రామ్మోహన్‌ను బదిలీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన నిశాంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసింది. దీంతో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రామ్మోహన్‌ను పూర్తిస్థాయి ఆర్డీవోగా నియమించడం జరిగింది. అలాగే తిరుపతి జిల్లా డిఆర్‌ఓగా ఉన్న పెంచల్ కిషోర్‌ను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి నూతన డిఆర్‌ఓగా జి.నరసింహులును నియమించడం జరిగింది. పెంచల్ కిషోర్‌కు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకుండా ఆయన జిఏడికి రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. తిరుపతి జిల్లాలో గత 20 నెలలుగా డిఆర్‌ఓ పెంచల్ కిషోర్ పనిచేశారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించండి: సిపిఎం



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రజాపరిష్కారం వేదికలో ఇచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్‌ఓ పెంచల కిషోర్‌కు వినతిపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతిసోమవారం వందలాది మంది ప్రజలు తమ సమస్యలు పరిష్కరించమని అర్జీలు సమర్పిస్తున్నారని తెలిపారు. అర్జీలు తీసుకున్న అధికారులు రసీదులు ఇస్తున్నారని, మండల అధికారులు సంబంధిత ప్రజలకు ఎండార్స్మెంటు ఇస్తున్నారని తెలిపారు. తీరా కలెక్టరేట్ నుంచి ఫోన్ ద్వారా తమ సమస్య పరిష్కారం కాలేదని తిరిగి కలెక్టర్ కార్యాలయానికి రమ్మని చెబుతున్నారని దీంతో ప్రజలు వ్యయప్రసాలకోర్చి మళ్లీ ఇబ్బంది పడుతూ రావల్సివస్తోందని తెలిపారు. మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించమని అధికారులకు తగిన సూచనలు చేయకుండా బాధితులను పదేపదే కలెక్టర్ కార్యాలయానికి రప్పించి ఇబ్బందులకు గురిచేయడం సమజసం కాదని తెలిపారు. ఇకనైనా ప్రజల సమస్యను సమగ్రంగా పరిశీలించి తగుచర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్రజలు పదేపదే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాకుండా సమస్య పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సిపిఎం కార్యదర్శి గంధం మణి, రాజా, బి.రవి పాల్గొన్నారు.

'ఫుట్‌పాత్' ఆక్రమిస్తే జరిమానా

55 మంది వ్యాపారులకు రూ.27,500లు జరిమానా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ రోడ్డుకి ఇరువైపులా వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే వ్యాపారులకు 3వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి జడ్జి సంధ్యారాణి గురువారం తీర్పు ఇచ్చారు. ఫుట్‌పాత్ రోడ్డును ఆక్రమించిన 55 మంది వ్యాపారులపై తిరుపతి పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వారందరికీ రూ.27,500లను న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

పలువురికి గాయాలు




పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ తహశీల్దారు కార్యాలయ సిబ్బంది

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని తహశీల్దారు కార్యాలయంలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచింది.. పిచ్చికుక్క దాడిలో తహశీల్దారు కార్యాలయ అటెండర్, కార్ డ్రైవర్ గాయపడ్డారు. కార్యాలయానికి పనులపై వచ్చిన పలువురిపై దాడికి యత్నించడంతో వారు పరుగులు తీశారు. పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ వారు గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలలో కుక్కల స్వైర విహారంపై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోయారు.

విహార యాత్రలో విషాదం — యువకుడు మృతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: విహార యాత్రకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాద వశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రం చెకిపోస్టు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ విశ్వనాథనాయుడు కథనం మేరకు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం, మనుబోలు గ్రామానికి చెందిన అమరేంద్ర కుమారుడు కన్నావరం భరత్ కుమార్ (19) తన మండలం మాంబట్టు గ్రామంలో తన అమ్మమ్మ సంవత్సరీకం కార్యక్రమానికి వచ్చాడు. అక్కడి నుండి బంధుమిత్రులతో కలిసి ఉబ్బలమడుగు పర్యాటక కేంద్రానికి విహార యాత్రకు వెళ్లాడు. ప్రమాద వశాత్తు ఉబ్బలమడుగు చెకిపోస్టు సమీపంలోని కాలువలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న బిఎన్ కండ్రిగ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కాలువలో పడి మృతి చెందిన కన్నవరం భరత్ కుమార్

క్రైం న్యూస్

లారీని తప్పించబోయి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది..

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాటూరు సమీపంలో శ్రీకాళహస్తి నుండి చెన్నైకి మార్గానికి వెళ్లే వెళ్లే 4488 నంబర్ గల కారు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకుపోవడంతో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన ముగ్గురిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు ధర్నాలను జయప్రదం చేయండి

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం మస్టర్ పాయింట్ల వద్ద నిర్వహించనున్న ధర్నాలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండు చేశారు. గూడూరు మున్సిపాల్టీ పారిశుధ్య కార్మికుల దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎ వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో 17 రోజులు సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, 10 ఏళ్ల సర్వీస్ ఉంటే 75 వేల రూపాయలు, ఆప్కో ఒక్కొక్కరికి ఏదాదికి రెండు వేలు రూపాయలు చెల్లింపు, ప్రమాద మృతులకు ఏడు లక్షల రూపాయలు, దహన సంస్కారాలకు 20 వేల రూపాయలు చెల్లింపు, క్లాప్ డ్రైవర్లకు చట్టబద్ధంగా జీతాలు, సెలవులు అమలు, తదితర హామీలను అమలు చేస్తూ నేటికీ కూటమి ప్రభుత్వం జీవోలు ఇవ్వకపోవడం, అనేకచోట్ల అక్రమ తొలగింపులకు పాల్పడుతూ లక్షలది రూపాయలను పోస్టులు అమ్ముకోవడం, మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుండడాన్ని నిరసిస్తూ ఈ నెల 25వ తేదీ అన్ని మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులు చేపట్టనున్న ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు (అనుబంధం) తిరుపతి జిల్లా కార్యదర్శి బి గోపీనాథ్, పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి చంగసపల్లి రాజేష్, గూడూరు సిఐటియు పట్టణ నాయకులు జోగి శివకుమార్, పి శ్రీనివాసులు బివిరమణయ్య, ఎస్ సురేష్, అడపాల ప్రసాద్, గూడూరు పట్టణ మున్సిపల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: వర్షాలు పడ్డ కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం వుందని ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా వుండాలని బుచ్చినాయుడు కండ్రిగ మండల తహాసిల్దార్ వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డివిఎన్ వెంకటేశ్వర్లు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం కారణంగా దోమలు అధికమై డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, మెదడు వాపు వ్యాధి, బోదకాలు వ్యాపిస్తాయని, నీటి కాలుష్యం వల్ల టైఫాయిడ్, విరేచనాలు వచ్చే ప్రమాదం వుందని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం నిల్వ వుంచుకున్న నీటిని శుభ్రపరచి ఖాళీ చేసి మళ్లీ నీటిని పట్టుకోవాలని, డ్రైడే పాటించాలని సూచించారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురుగు కాలువలలో మట్టిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ వేయాలని సెక్రెటరీ సుబ్రహ్మణ్యంకు సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ కలపాలని సూచించారు. పైపుల లీకేజీ లేకుండా చూసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు మంజూరు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నాగలాపురం సుందరయ్య కాలనీలో పేదలైన దళితులు, గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దళితులకు, గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ గురువారం సుందరయ్య కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేని పేదలందరికి సిపిఎం ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా అనేక పోరాటాలు, ఆందోళనలు చేసిన ఫలితంగా గత ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చినందుకు, వారికి పక్కా ఇల్లు, సిమెంట్ రోడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని టిడిపి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నియోజకవర్గ నాయకులు రమేష్, దినమణి, సుబ్బమ్మ, బాలాజీ, అముదా, మురుగేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాల గురవబాబు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యమని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవబాబు పేర్కొన్నారు. గూడూరు కాంగ్రెస్ కార్యాలయంలో బాల గురవ బాబు, అబ్జర్వర్ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, పార్టీ నాయకులు కలిసి కాంగ్రెస్‌ని మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో బలోపేతానికి కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల గురవ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిమళ వెంకటేశ్వర్లురావు, డాక్టర్ రామకృష్ణ, రాష్ట్ర నాయకులు ఆమవరపు సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రాధయ్య గౌడ్, గౌస్ బాషా, రమాదేవి, మల్లారెడ్డి పాల్గొన్నారు పాల్గొన్నారు.

సిసిల సస్పెన్షన్‌ను రద్దు చెయ్యాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏపీ షెడ్యూలు కులాల సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డిఆర్‌డిఏ లో సిసిల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగి శెట్టి ధర్మయ్య పేర్కొన్నారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరు లతో మాట్లాడుతూ నిరు పేదల అభ్యున్నతికి అవిష్కారించిన అర్‌డిఏ శాఖ ఉన్నతాధికారుల అక్రమ ప్రవర్తనతో కుదేలైపోతోందన్నారు. పొదుపు సంఘాల నుండి సిసిలు డబ్బులు వసూలు చేసే విధులు లేవని తెలిపారు. పొదుపు గ్రూప్‌ల ద్వారా రుణాలు పొందిన నిరు పేదలు తిరిగి చెల్లించే క్రమంలో సిసిలను బాధ్యులుగా చేసి సస్పెన్షన్ విధించడం అన్యాయమన్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి సిసిలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లిపాటి అశోక్ , చింతల రాఘవయ్య , అజయ్ పాల్గొన్నారు.

వర్షపు నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టండి: ఎమ్మెల్యే



రోడ్డుపై వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): రోడ్డుపై వర్షపు నీరు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. చంద్రగిరి మండలంలోని రాయలపురం పంచాయతీ, వెంకటంపేట వద్ద జాతీయ రహదారి నుండి చంద్రగిరి పట్టణంలోకి వెళ్లే మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వవున్న ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై నీరు నిల్వ లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. తేలికపాటి వర్షాలకు నీరు నిల్వ ఉంటోందని, ఈ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. కాలువలు కబ్జా చేసి ఇల్లు, భవనాలు నిర్మించడంతో పాటు చెత్తాచెదారం వేయడంతో వర్షపు నీరు వెళ్లేందుకు దారి లేదని అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. నీరు నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు ఇబ్బందులు పడు తున్నారు. నిల్వ కారణంగా సమీప ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని దీనికి పరిష్కారం వెంటనే చూడాలని అధికారులకు ఎంఎల్‌ఏ ఆదేశించారు. స్థానికలు, స్థానిక నాయకుల వద్ద సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించి సమస్య పరిష్కరిస్తానని ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, కుమార్ రాజా రెడ్డి, బాదురు ఎల్లయ్య, సక్కూరి ధనుంజయ రెడ్డి, వి రమేష్ రెడ్డి, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం తిరుమలకుప్పం గ్రామ పంచాయతీ తిరుమలకుప్పం ఏఏడబ్ల్యూకు చెందిన టిడిపి కార్యకర్త గోవిందయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్, పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పుత్తూరు రూరల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి ఏ బాలాజీ, టీడీపీ నాయకులు ఈశ్వర్, గిరి, భాస్కరయ్య ఉన్నారు.

'ఎస్వీయూ రిజిస్ట్రారు అవినీతిపై విచారణ చేయాలి'

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో రోజురోజుకూ అవినీతికి అంతే లేకుండా పోతోందని దీనిపై విచారణ జరిపించాలని వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యాలయంలో అడుగడుగునా అవినీతి పేరుకుపోతోందని, అక్రమ బదిలీలలో భారీ ఎత్తున అవినీతి చేతులు మారాయన్నారు. వర్సిటీ స్టేడియంను కమర్షియల్ కార్యక్రమానికి అనుమతి విషయంలో యూనివర్సిటీ ఉన్నత అధికారులు భారీ ఎత్తున అవినీతికి పాలపడ్డారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు.

రాష్ట్ర హాకీ పోటీలకు 'శ్రీ గాయత్రీ' విద్యార్థి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి మోక్షిత్ అండర్ -14 విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, డీన్లు శ్రీ హరి బాబు, సోనియా, పీడీ చైతన్య పాల్గొన్నారు.



విద్యార్థి మోక్షిత్‌ను అభినందిస్తున్న శ్రీ గాయత్రీ హైస్కూల్ యాజమాన్యం

యర్రావారిపాలెం: మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని ఎస్వీయూ హైస్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన ఎస్జిఎఫ్ అండర్ 19 వాలీబాల్ విభాగంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న మాధవ్, తేజ, రాజేశ్వరి, విద్యార్థులు వాలీబాల్ పోటీలలో విశేష ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలియచేశారు.

'మహిళలకు శిక్షణ, నైపుణ్యాల ద్వారానే ఉపాధి'

ప్రజాశక్తి - క్యాంపస్ : గ్రామీణ మహిళలకు వివిధ రకాల శిక్షణ, నైపుణ్యాల ద్వారానే స్వయం ఉపాధి సాధించవచ్చని మహిళా అధ్యయన కేంద్రం డాక్టర్ హైమావతి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, అధ్యయన కేంద్రం, లైవ్లీహుడ్ బిజినెస్ ఇన్ క్యుబేటర్, రాస్ జన శిక్షణ సంస్థాన్ సంయుక్తంగా మూడు నెలల అప్పేరల్ డిజైనింగ్‌పై శిక్షణను పెరుమాళ్ల పల్లె పంచాయతీ, కొప్పరి వాండ్ల పల్లె గ్రామ మహిళలకు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమ ఆర్గనైజర్ హైమావతి మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో డిమాండ్ వున్న అప్పేరల్ డిజైనింగ్‌పై ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంచుకొని స్వయం ఉపాధి సాధించడమే కాకుండా, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి అభివృద్ధి చెందవచ్చునని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ జెఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ మాట్లాడుతూ పెరుగుతున్న కుటుంబ ఖర్చులను దృష్టిలో వుంచుకుని మహిళలు నైపుణ్యాలను పెంచుకొని ఆర్థిక అభివృద్ధికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్, అధ్యయన కేంద్ర సిబ్బంది ఎం ఇంద్రాణి ఎం సుచరిత, సంఘమిత్ర ఎన్ సునీత, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్వాహకురాలు హైమావతి

ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ : డాక్టర్ పవిత్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆయుర్వేద వైద్యంతోనే మనిషి ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ పవిత్ర పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె రాణి 'ఆరోగ్య సమస్యలు – వాటి పరిష్కారాలు' అనే అంశంపై అవగాహనను శ్రీనివాస నగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణురాలు డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యానికి ఎలాంటి దుష్పరిణామాలు వుండవని, అందరికీ అందుబాటులో వుండే సుగంధ ద్రవ్యాలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మహిళల ఆరోగ్య సమస్యలు, పిల్లలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను సమూలంగా వివరించి వాటి నివారణోపాయాలు సూచించారు. ఆరోగ్య సమస్యలను వాటికి ఆయుర్వేద పరిష్కారాలను సూచించారు. ముఖ్యంగా ఆధ్యాత్మికంగా, సామాజికంగా సత్సంబంధాలు కలిగి ఉండటం ద్వారా మనకు మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన విభాగం డాక్టర్ పద్మావతి, ప్రాజెక్ట్ అసిస్టెంట్ సుచరిత, ఇంద్రాణి, సిఓ మహేశ్వరి, ఆర్టీ సంధ్య, మహిళలు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి):

బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రగిరి మండలం, గంగుడిపల్లిలో ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన బోడి రెడ్డి నిరంజన్ రెడ్డికి ఆసుపత్రి వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ కింద 89,345 రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారికి ఆరోగ్య సంరక్షణ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పెద్ద మొత్తాలలో ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. వైద్యం కోసం చేసిన ఖర్చులను ముఖ్యమంత్రి ఉదారంగా అందిస్తున్నారని తెలిపారు.

ఎక్స్టెటెన్షన్‌కు ల్యాండ్ పూలింగ్

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) లో మరి కొన్ని ప్రత్యేక భవనాలను ఏర్పాటు చేసేందుకు , చిందేపల్లెలో ఏర్పాటు చేసిన పవర్ డిస్ట్రిబ్యూషన్ సబ్‌స్టేషన్‌కు, భారీ వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు రోడ్డు విస్తీర్ణలో భాగంగా సేకరించిన రైతుల రైతుల భూములను పరిశీలించారు. ఈ కార్యక్రయంలో తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డిఓ ఎన్ రవి శంకర్ రెడ్డి, ఏర్పేడు ఎమ్మార్వో భార్గవి పాల్గొని ఎంతవరకు రైతుల భూములు అవసరమవుతాయో పరిశీలించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -కోట : మర్రిబోయిన జయరామయ్య, మర్రిబోయిన జయమ్మ ల జ్ఞాపకార్థం మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడుతామని యువ పారిశ్రామిక వేత్త మర్రిబోయిన రాజేంద్ర అన్నారు. గురువారం కోట మండలంలోని కేశవరం పంచాయతీ రాఘవాపురం గ్రామంలోని మర్రిబోయిన రాజేంద్ర నివాసంలో తల్లి దండ్రులైన మర్రిబోయిన జయరామయ్య 15 వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తల్లి నెల దినం సందర్భంగా వారి జ్ఞాపకార్థం 200 మంది పేదలకు దుప్పట్లును సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రఘురామయ్య, మర్రిబోయిన రాజేంద్ర,వెంకటరమణ లు చేతులు మీదగా అందించారు. అనంతరం మర్రిబోయిన రాజేంద్ర మాట్లాడుతూ తనకు చిన్నవయస్సులో విద్యాభ్యాసం నేర్పిన ఉపాధ్యాయులు చేతులు మీదుగా దుప్పట్లు పంపిణీ చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతే కాకుండా తల్లిదండ్రులు జ్ఞాపకార్థంతో సేవ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ ం ద్రి బో ం ం ం న వెంకటరమణ,స్థానిక నాయకులు కోటి,తిరుపతి ఎస్సీ సెల్ కార్యదర్శి కసుమురు. వెంకటేశ్వర్లు, మస్తాన్, మర్రిబోయిన కృష్ణయ్య పాల్గొన్నారు.



దుప్పట్లు అందిస్తున్న దాతలు

శ్రోతలను యూనివర్సిటీలోకి రాకుండా అడ్డుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తారకరామా స్టేడియంలో 26వ తేదీ నిర్వహించనున్న కార్యక్రమానికి తిరుపతి పట్టణంలోని ప్రజలు, శ్రోతలు పార్కింగ్ ప్రదేశంగా వర్సిటీ ప్రాంగణాన్ని వాడకుండా చూడాలని సిఐకి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26 తేదీన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ప్రముఖ సినీగాయకుడు కార్తీక్ ఆధ్వర్యంలో జరిగే పాటల కార్యక్రమాన్ని జరగనివ్వకుండా అడ్డుకుంటామని రెండు రోజుల క్రితం ఎఫ్ఎఫ్ఐ నాయకులు యూనివర్సిటీ ఉపకులపతికి తెలిపారు. అయితే వర్సిటీ అధికారులు విద్యార్థి నాయకులకు బయపడి పోలీసులను రంగంలోకి దింపారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో క్యాంపస్ పోలీస్ స్టేషన్ సీఐ రామయ్య ఎస్ఎఫ్ఐ నాయకులను స్టేషనుకి పిలిపించి చర్చించారు. ఈ పాటల కార్యక్రమానికి వేలాది మంది యువత హాజరవుతారు కావున వారిని యూనివర్సిటీలోకి రానివ్వకుండా, యూనివర్సిటీలో పార్కింగ్ కి అనుమతి ఇవ్వకుండా వర్సిటీ ప్రశాంత తను కాపాడా లని కోరారు. సీఐ రామయ్య స్పందిస్తూ యూనివర్సిటీ ప్రతి గేటు వద్ద పోలీసులను ఉంచి బయట వారెవరూలోపలికి రాకుండా చూసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి జిల్లా నాయకులు అశోక్, వినోద్, నరేంద్ర, తేజ పాల్గొన్నారు.



సీఐకి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంచి సందేశాత్మక చిత్రం 'ఊహల్లో జీవితాలు'

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): సమాజంలో ఉన్న పౌరులకు మంచి సందేశాత్మక చిత్రంగా ఊహల్లో జీవితాలు క్షేత్రం నిలుస్తుందని చిత్రదర్శకుడు సుభాష్ బాబు తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన చిత్రనిర్మాణ విషయాలను మీడియాతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఊహల్లో జీవితాలు చిత్రం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ చిత్రంలో ప్రముఖ సినీ నటుడు సుమన్, సినీనటి ఆమని, ముగ్గురు హీరోలు, హీరోయిన్లతో సందేశాత్మకమైన కథతో నవంబర్ మొదటి వారంలో హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా నిర్వహించనున్నారు. చిన్మయ క్రియేషన్స్‌లో రూపొందుతున్న ఈ చిత్రం తనకు రెండవ చిత్రమని, తాను మొదటగా రాజధాని, ఒక్కడు చిత్రం ద్వారా మంచి ఆదరణ పొందానన్నారు. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య వద్ద అసిస్టెంట్ గా పనిచేసిన అనుభవంతో తన దర్శకత్వంలో రెండవ చిత్రంగా ప్రజలకు కనెక్ట్ అయ్యే కథను తెరకెక్కించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నటీ నటులు పద్మ, కరాటే ధనంజయ్, రెడ్డెప్ప, యూట్యూబ్ స్టార్ పొట్టిమామ (రవీంద్ర) పాల్గొన్నారు.

శ్రీసిటీ సందర్శన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వసుధా మిశ్రా నేతృత్వంలోని పారిశ్రామిక భద్రత ప్రమాణాల ఉన్నత స్థాయి కమిటీ ఈనెల 21 నుంచి మూడు రోజుల పాటు శ్రీసిటీలో చేపట్టిన తనిఖీలు బుధవారంతో ముగిశాయి. పారిశ్రామిక రంగాలలో భద్రత పట్ల అవగాహనను పెంపొందించడానికి, కార్మికుల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేకచర్యల్లో భాగంగా కమిటి పర్యటన సాగింది. ఈ పర్యటనలో కమిటీలోని ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు శ్రీసిటీలోని ప్రధాన పరిశ్రమలైన డైకిన్, డానియెలీ, కింబర్లీక్లార్క్, ఆల్స్టోమ్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో ఆయా పరిశ్రమలలో ఎలాంటి భద్రతా లోపాలు తమ దృష్టికి రాలేదని మిశ్రా తెలిపారు. ఇప్పటికే ఇక్కడ అమలులో వున్న పటిష్టమైన భద్రతా చర్యలే ఇందుకు కారణమని చెప్పారు. శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, పర్యావరణ అనుకూలమైన పద్ధతులు, సమగ్రమైన ప్రణాళికను ఆమె ప్రశంసించారు. శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలు నిర్దేశిత భద్రతా ప్రమాణాలను పాటించడంలో నిబద్ధతను కలిగి ఉన్నాయన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, దీనిని మరింత మెరుగుపరచడంలో కమిటీ సిఫార్సులు ఉపకరిస్తాయని పేర్కొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాల లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, పంచాయతీ కార్యాలయాల్లోనూ ఉచిత ఆధార్ నమోదును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆధార్ నమోదు కొనసాగుతోందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గురువారం ఆధార్ సెంటర్‌కు ఉదయం నుండి చిన్నపిల్లల నుండి పెద్దవారు సద్వినియోగం చేసుకున్నారు. దీంతో ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు పూర్తి ఉచితంగా సేవలు అందిస్తారని, ఫోన్ అప్‌డేట్ చేసుకోవాలనే వాళ్లు, ఫోన్ లింక్ చేసుకునే వాళ్లు కూడా చేసుకోవచ్చని, చిన్న పిల్లలు సైతం ఆధార్ సెంటర్‌లో కొత్తగా ఆధార్ కార్డు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్, కనకనంబేడు పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, పోలీస్ కాంచన పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని నెలబల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఎంఈవో కృష్ణయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికారులు , విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకురాలకు సలహాలు, సూచనలు అందించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా చంద్రగిరి అభివృద్ధిని సాధిస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగు పంచాయతీ వారోత్సవాలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. గురువారం మండలంలోని రాయలపురం, చంద్రగిరి పట్టణంలోని శ్రీకృష్ణ మందిరం, చిన్న రామాపురం గ్రామాలలో నిర్వహించిన పల్లెలో నిర్వహించిన పల్లె పండుగలో పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, చంద్రగిరి మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తి, కుమార్ రాజా రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ మునిరత్నం రాయల్, ఎస్ గౌస్ బాషా, బాలా నాయుడు, , శివకోటి రెడ్డి, మాజీ జెడ్పిటిసి అమ్ములు, వి రమేష్ రెడ్డి, లోకాద్రి నాయుడు, ధనుంజయ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు, పెన్సిళ్లు వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక గేట్ పుత్తూరు జిల్లా పరిషత్ హైస్కూలు(తమిళ)లో పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు డి ఎస్ గణేష్, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎం ఎస్ కరుణాకరన్, వార్డు కౌన్సిలర్లు కేశవ ఆచారి, 3వ వార్డు ఇన్‌ఛార్జ్, ఎస్‌కె కేశవ, 10వ వార్డు డి సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌కృష్ణవేణీ, హైస్కూల్ ఛైర్మన్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడల పోటీలకు గొల్లపల్లి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ :

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి భారతి తెలిపారు. పూతలపట్టులో జరిగిన ఎస్ జి ఎఫ్ అండర్ –14 హ్యాండ్‌బాల్ పోటీలలో అమృత, 9 వతరగతి విద్యార్థిని ఎంపికైంది. ఏకాంబర కుప్పంలో నిర్వహించిన అండర్ – 14. నెట్ బాల్ పోటీలో బాలుర విభాగంలో లక్ష్మీనారాయణ, రేవంత్, లవ కుమార్, యశ్వంత్, పవిత్ర, జానీ ఎంపికయ్యారని తెలిపారు. నవంబర్ 9,10,11 వ తేదీలలో విశాఖ పట్నంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఆ పాఠశాల పీడీ గోపికృష్ణ తెలిపారు. ఈ ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు. విద్య కమిటీ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

'ఆస్తి నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం):

కోర్టులో కేసు ఉండగానే దౌర్జన్యంగా వ్యవహరించి పోలీసుల సాక్షిగా పవర్ లూమ్స్‌ను ధ్వంసం చేశారని లీజుదారు వడ్డి యశోద వాపోయారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలోని గాంధీపురం పంచాయతీ శ్రీనగర్ కాలనీలో డి.రాజేశ్వరరావుకు చెందిన స్థలంను లీజు ప్రతిపాదికన అద్దె చెల్లిస్తూ ఎల్‌వి పవర్ లూమ్స్‌ను నిర్వహించుకున్నట్లు తెలిపారు. అద్దె చెల్లింపుల్లో తలెత్తిన వివాదంతో కోర్టును ఆశ్రయించామని, బ్యాంకుల నుండి రుణాలు తీసుకోని ఈ పవర్ లూమ్స్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తమకు జీవనాధారమైన పవర్ లూమ్స్‌ను ధ్వంసం చేసి ఆస్తి నష్టం కలిగించారని వాపోయారు. రాజేశ్వరరావు, సరోజిని దేవిలపై చర్యలు తీసుకోని ఆస్తి నష్టాన్ని ఇప్పించాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

'అధిక రసాయన ఎరువులతో అనర్థాలు'

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

వరిసాగులో అవసరానికి మించి రసాయన ఎరువులు వాడకం వలన మేలు కంటే చెడు అధికంగా జరుగుతుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. చిల్లకూరు మండలం, కడివేడు గ్రామంలో రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. వరిలో రైతులు అధికంగా వేసే యూరియాలో 70 శాతం వరకు భూమిలోనికి ఇంకిపోవడం, గాలిలో కలిసి వృధా అవుతుందన్నారు. పొలాలకు అధికంగా యూరియా వాడకం వల్ల భూగర్భ జలాలు కలుషితం అవ్వడంతోపాటు చీడలకు అధికమవుతాయని వివరించారు. కాంప్లెక్స్ ఎరువులను నాట్లుకు ముందు మాత్రమే వేయాలని తెలిపారు. రైతులు విరివిగా సేంద్రీయ ఎరువుల వాడి, మితంగా రసాయన ఎరువులు వాడాలని ఆయన కోరారు. వరిలో కలుపు యాజమాన్యం, పోషక, చీడల యాజమాన్యం గురించి జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు వివరించారు. రాబోవు రబీ కాలానికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి భవాని తెలిపారు.